# పతి దేవుడూ - పనిమనిషీ

ఉపక్రమణిక : ఆమె సీత కానీండి, సావిత్రి కానీండి, అరుంధతో అనసూయో ఎవరేనా కానీండి. వాణీ, రాణీ, వీణా, విద్యా అయినా ఫరవాలేదు, ఎవరైనా ఆమె ఒక మధ్య తరగతి మహిళామణి. పతితోడిదే లోకం ఆమెకి. ఆయనంటే అంతులేని గౌరవం, విపరీతమైన అనురాగమూను. ఇంతెందుకు? ఆయన సాక్షాత్తూ తనపాలిటి భగవంతుడు, ప్రత్యక్ష దైవం, ప్రణయమూర్తి, పతిదేవుడు.

అవునాండీ! అలాంటి పతి దేవుడికి పేస్ట్, బ్రష్‌లు అందిస్తూ మేలుకొలుపులు పాడ్డం; శుచీ, రుచీ, వేడీ, వెచ్చనా ఉన్న కాఫీని కావలసినన్ని పర్యాయాలు సరఫరా చెయ్యడం దగ్గర్నుంచి, సమస్త రాజోపచారాలూ సాగిస్తూ, హితవైన భోజనం, ఇంపైన తాంబూలం అందించి, సకాలానికి ఆఫీసుకి సాగనంపే కార్యక్రమంలో, కళ్ళతో వీధి మలుపు తిరిగేదాకా వీధిగేటుని పట్టుకుని ఆమట్టునే నిలబడిపోవడం వరకూ, ఎన్నిరకాల సేవలు చెయ్యాలి చెప్పండి.

మరి ఈ సేవలన్నీ 'నేటి ప్రసార విశేషాల'తో ప్రారంభమయి, 'ఉదయ ప్రసారం సమాప్తం' అయేలోగా ఒక్కచేతి మీదుగా జరగాలంటే మాటలా? ఎన్ని చిల్లర పనులు అడ్డొస్తాయి. ఈ సేవలకి? అందువల్ల ఆ చిల్లర పనులు చేసిపెట్టి, తనకి పతిసేవ చేసుకొనే అవకాశ మిచ్చే ఏ అసిస్టెంటో, సర్వెంటో, సాధారణంగా దాసీ మనిషి రూపంలో పనిమనిషి అనబడే ఒక పార్ట్‌టైమ్ వర్కరో, విధిగా అవసరం, మధ్య తరగతి మహిళామణికి. అందువల్ల ప్రతి ఇల్లాలికీ ఇంట్లో రెండు ముఖ్యమైన శాల్తీలు దఖలు పడతాయన్న మాట. ఒకటి తను సేవలు చెయ్యవలసిన మగదేవుడూ, రెండు తనకి సాయం చేసిపెట్టే ఆడ పనిమనిషి. వీళ్ళల్లో, ఒకరు తనకి బాస్, రెండో వాళ్ళు సబార్డినేట్. తనేమో వీళ్ళిద్దరిమధ్యా లైజెన్‌ఆఫీసరుగా పని జేసే సూపరెంటెండెంట్.

మనకథలో : అలాంటి సూపరెంటెండెంట్ పేరు సుబ్బాయమ్మ. బాస్ పేరు రామారావు అనుకుందాం. సబార్డినేట్‌ని సిమ్మాచలం అంటే సరిపోతుంది. ఏం?

ఆ రోజు కూడా రోజూలాగే సుబ్బాయమ్మ పాలవాడి సుప్రభాతం విని, పాల్కడలి లాంటి పక్కమీద మేల్కొంది. ప్రక్కని పసివాడిలా నిద్రపోతూన్న పతిదేవుడి పవిత్ర హస్తాల్ని తన నడ్డిమీంచి సుతారంగా తప్పించి నవ్వుకుంది. తర్వాత రూల్ ప్రకారం నమస్కరించవలసింది పతిచరణాలకే. కాని జీవితాన్ని మరీ తెలుగు సినిమా చెయ్యడం ఇష్టంలేకో ఏమో, చరణాల చాదస్తాలకి పోకుండా, మెళ్ళో ఉన్న మంగళ సూత్రాల్ని కళ్ళకద్దుకోవడంతో సరిపెట్టుకుంది.

వీధిలోంచి "రండిఅమ్మగారూ! ఎండెక్కిపోతోంది" అని పాలవాడి కేక.

"ఏవిటా కేకలు? అరవకు. అవతల అయ్యగారు నిద్రపోతున్నారు" అంటూ బుసకొట్టినట్లు శబ్దం లేకుండా గట్టిగా మందలించి పంపించింది సుబ్బాయమ్మ.

పాలగిన్నెతో ఇటు తిరిగిందో లేదో, వెనకనుంచి "అమ్మగారూ! సీపురెక్కడెట్టారండి?" అంటూ సిమ్మాచలం రంకె.

సుబ్బాయమ్మ గుండె ఆగినట్లయింది.

"ఆ రంకెలేవిటే?... అవతల అయ్యగారు..." అంటూ మళ్ళీ బుసకొట్టేదే సుబ్బాయమ్మ. కాని అలా చెయ్యలేదు. అంటే ఆమెకి కేకలు ఇష్టంలేదనీ, రంకెలిష్టమనీ అర్థం కాదు. దాని అర్థం ఏమిటంటే పాలవాడికీ, పనిమనిషికీ ఉన్నతేడాని ఆమె గ్రహించిందన్నమాట! పాలవాళ్ళు 'కో' అంటే కోటిమంది. వీడుకాకపోతే మరొహడు. అందువల్ల తిట్టినా పడతాడు. 'ఛీ' అన్నా ఊరుకుంటాడు. ఊరుకోడూ...? పాలకేంద్రం ఉండనే ఉంది.

కాని, పనిమనిషి అలా కాదే? లోకంలో పంచదారైనా దొరుకుతోంది కాని పనిమనిషి దొరకడం లేదు. వలేసి పట్టగా పట్టగా చివరికి సిమ్మాచలం దొరికింది. దీన్నే ఎలాగో కబుర్లు చెప్పి, కాఫీ ఇచ్చి మంచిచేసుకుని, రోజుల్ని నెట్టుకుంటూ వస్తోంది తను. దీనిమీద ఇప్పుడు 'గయ్' మంటూ లేస్తే ఎలా?

ఒకటి అంటే పది అంటుంది ఇది.

మరీ కోపం వస్తే "నా కిప్పుడు వంట్లో బాగోలే' దంటూ నుంచున్న పళాన వెళ్ళిపోతుంది. వెళ్తే ఇంకేం ఉంది? ఇంటెడు చాకిరీ, ప్లస్ దాసీపని మొత్తం మోపెడై తన తలకి చుట్టుకుంటుంది.

మరీ చిరాకేస్తే పూర్తిగా పనిలోంచి మానేసినా మానెయ్యొచ్చు. మానేస్తే ఇంకేమైనా ఉందా?

హమ్మో! ఇదంతా క్షణంలో ఆలోచించ గలిగింది కనకే. సాధ్యమైనంత ప్రసన్నతని

ముఖంలో తెచ్చుకుంటూ సౌమ్యంగా అడిగింది సుబ్బాయమ్మ. "పెరట్లో లేదా?" అని.

"ఉంటే ఎందుకడుగుతానండి? ఎతికి ఇక్కడడెయ్యండి. వొచ్చి కసవూడుస్తా" అంటూ దభీమని గేటు తీసుకుని పక్కింటి కెళ్ళిపోయింది సిమ్మాచలం.

చీపురు కోసం సుబ్బాయమ్మ పెరడంతా వెదికింది, అరుగుకింద చూసింది. తలుపు వెనకాల తడిమింది, నీళ్ళగదిలో గాలిస్తూండగా జ్ఞాపకం వచ్చింది. 'స్టౌ మీద పాలు పెట్టి వచ్చా'ననే సంగతి. అయితే సాధారణంగా పాలు మరుగుతాయి కాని పొంగవు, ఎప్పుడేనా పాలవాడు పొరబాటున రెండు గ్లాసుల బదులు ఒక గ్లాసు నీళ్ళు కలిపినప్పుడు తప్ప. ఏమో ఖర్మకాలి. ఆ పొరబాటు ఇవాళ జరిగిందేమో!

మెళుకువ వచ్చీరాక, మత్తుగా బద్ధకంగా ఆ మట్టునే పడుకున్న రామారావుకి, చిత్రమైన కల - కల అని తెలిసిపోతూన్న కల - భలేగాఉంది ఆ అమ్మాయి... ఆ నవ్వు ఎంతో కవ్విస్తోంది! ... కసిగా తన చేతుల్లో నలిగిపోతున్న కొద్దీ మరీ నవ్వుతోంది.. మత్తెక్కిస్తూన్న నవ్వు ... కసిగా బిగుసుకుంటూన్న చేతులు ... నవ్వుతూన్న కళ్ళు... కదులుతూన్న చేతులు... ఒకటే నవ్వు... ఒకటే నవ్వు...

"ఏవండీ! పాలు పొంగుతాయేమో - కాస్త స్టౌ దగ్గర నిలబడండి"

అది కేకాకాదు- అరుపూకాదు - రంకే కాదు...

కలలలోకంలోనే కాదు, ముల్లోకాల్లోనూ ఎక్కడున్నా సరే, రామారావు చెవుల్లోకి ఖచ్చితంగా వచ్చి గింగురుమంటూ మారు మ్రోగిపోయే సుగ్రీవాజ్ఞ అది.

ఒక్క ఉదుటున మంచం మీంచి ఉరికాడు రామారావు.

రెండో ఉదుటుకి స్టౌ పక్కనిలబడ్డాడు.

క్షణం క్రితం మత్తెక్కిస్తూన్న అమ్మాయి దగ్గర-

క్షణంలో మండిపోతూన్న స్టౌ ఎదురుగా.

"ఏం జీవితంపోనిద్దూః" అంటూ విరక్తిగా నిట్టూర్చాడు రామారావు.

"పాలు మరిగాయి - స్టౌ కట్టెయ్యనా?" దూరం ఊరికి ట్రంక్ కాల్ బుక్ చేసి, ఫోనులో మూతి పెట్టి అరిచినట్లు అరిచాడు రామారావు.

"బాబ్బాబు - మీకు పుణ్యం వుంటుంది గ్లాసుడు నీళ్ళు స్టౌ మీద వెచ్చబెట్టి డికాక్షన్ తియ్యండి. వస్తున్నా" బస్‌లోంచి కండక్టరు తోసేస్తూంటే, 'ఒక్క సీటుంటే చూడు' అని కాళ్ళా వేళ్ళాపడే ప్రయాణీకుడి దైన్యం ధ్వనించింది సుబ్బాయమ్మ గొంతులో.

"తనక్కడ ఏ రాచకార్యం వెలగబెడుతున్నట్లు?" - భలే చిరాకేసింది రామారావుకి.

"అన్నట్లు గ్లాసుడు కాదు - ఇంకో అరగ్లాసుడు ఎక్కువ తీయ్యండి డికాక్షను. లేకపోతే తర్వాత మళ్ళీ సిమ్మాచలం కోసం ఇంకోమాటు స్టౌ అంటించాలి" యీ మాటు గొంతులో బ్రతిమాలడం లేదు, ఒక రకమైన బెదిరించడం ఉంది.

కోపం వచ్చి రామారావు మరో చెంచాడు కాఫీ పొడుం ఎక్కువ వేశాడు నీళ్ళలో - ఇంతలో పెరట్లోంచి మాటలు విన్పించసాగాయి.

"ఇదిగో చీపురు. గబగబా కసువూడ్చేసి గుమ్మాలు కడిగెయ్! ఈలోగా కాఫీ రెడీ చేసి ఇస్తాను. తర్వాత అంట్లు తోముదువుగాని" సుబ్బాయమ్మ గొంతు పురమాయిస్తున్నట్లు లేదు, 'దయయుంచి ఈ విధంగా చేయగోర్తాను' అని అర్జీ పెట్టుకుంటున్నట్లుంది.

"నేనొచ్చేతలికి బాల్చీల్లో నీళ్ళు బారుగా వొంపేస్తున్నారేటి? నిన్న సాయంత్రం కొట్టెళ్ళిన నీళ్ళు, ఒక్క సుక్క కూడా ఉండవేం?" సిమ్మాచలం చిరాకుపడింది.

ప్రొద్దుట పనిలోకి వచ్చేటప్పటికి బాల్చీలు పూర్తిగా ఖాళీగా ఉంటే సిమ్మాచలానికి నచ్చదు. భలే కోపం వస్తుంది. ఆ రోజల్లా రుసరుసలే - పలకరించడానికి వీల్లేదు. అగ్గిమీద గుగ్గిలంలా ఉంటుంది. సుబ్బాయమ్మ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వణికిపోతుంది అలాంటప్పుడు. ఆ రోజు స్టీలు మరచెంబుకి సొట్టలు పడొచ్చు. ఏ పింగాణీ కప్పో తనువు చాలించవచ్చు, నీళ్ళపంపుకి ఉన్న వాషర్ పోవచ్చు - ఏ ప్రమాదమైనా జరగవచ్చు.

ఇలాంటి ప్రమాదం ఏం జరక్కుండా, రోజూ ముందుగా లేస్తూనే సుబ్బాయమ్మ జాగ్రత్త పడుతుంది. సిమ్మాచలం రాకముందే బాల్చీల్లో నీళ్ళు ఉన్నాయో లేవో చూసుకుంటుంది. అవసరం అయితే రామారావుని లేపి మూడు బాల్చీలలోనూ మూడు సగాలకేనా నీళ్ళుకొట్టించి రెడీగా ఉంచుతుంది. ఇవాళ చీపురు వెతకడం హడావిడిలో చూసుకోలేదు తను.

అందువల్లే కొంప మునిగింది. ఎలాగ? ఏవిటి చెయ్యడం? ఇప్పుడు తనో, తన పతిదేవుడో ఎవరో ఒకరు, ఒకటి, రెండు బాల్చీలలో నీళ్ళు కొట్టి, సిమ్మాచలం కోపాన్నీ,చిరాకునీ తగ్గించవచ్చు. కాని అలా చేస్తే మరీ దానికి భయపడిపోయినట్లు కనిపించేస్తుంది. అది రాకుండానే తనా పని పూర్తిచేసేస్తే అది వేరే విషయం.

తను పడిన ఈ కంగారునేమీ ముఖంలో కనిపించనియ్యకుండా, నవ్వుతూ, "ఏమే ఇవ్వాళపొద్దెక్కి వచ్చావు. రాత్రి సినిమాకి గాని వెళ్ళావేమిటి? యిద్దరూ కలిసే వెళ్ళారా? అదే...అప్పన్నా నువ్వూను" అంటూ యోగక్షేమాలు అడిగింది సుబ్బాయమ్మ.

నీళ్ళు కొడుతున్న సిమ్మాచలం ఛర్రుమంటూ లేచింది. "రోజూచినీమాలకి యెల్లడానికి మాము ఏప్పైనా డబ్బున్నోళ్ళమేటండి!" అంటూ -

పని మనిషి ప్రాపకం కోసం భార్య ఆ వరసని ప్రాకులాడ్డం చూడలేకపోయాడు రామారావు. వంటింట్లోంచి అరిచాడు "ముచ్చట్లు చాలుగాని, పేస్ట్, బ్రష్ తెచ్చిపెట్టు" అంటూ.

చెప్పొద్దూ - సుబ్బాయమ్మకి భర్తమీద భలే కోపం వచ్చింది. "అక్కడే గూట్లో ఉన్నాయి తీసుకోండి" అంది విసురుగా.

సిమ్మాచలానికీ కోపం వచ్చినట్లుంది. ముఖం చిట్లిస్తూ ఓ చేత్తో బకెట్టూ, మరో చేత్తో చీపురూ పుచ్చుకుని వీధిగుమ్మాలు కడగడానికి బయలుదేరింది మౌనంగా.

అంట్లగిన్నెలు పెరట్లో వేస్తున్నంతసేపూ ఆలోచిస్తూనే ఉంది సుబ్బాయమ్మ, పరిస్థితి సర్దుబాటు చెయ్యడం ఎలాగా అని. చేతులు కడుక్కుంటూండగా ఓ మార్గం దొరికింది.

"సిమ్మాచలం! గుమ్మాలు కడిగేసి కళ్ళాపు జల్లేసి నువ్వు వచ్చెయ్యి. ముగ్గు నేను పెడతాలే" అంది.

"ఇన్ని సెయ్యగా లేంది, ముగ్గెట్టడం కట్టం ఏంటండి? మీరెందుకు? నేనే ఎడతాలెండి"

అమ్మ - ఎంత గడుసుదని సిమ్మాచలం? అవకాశం ఇవ్వడం లేదు, కాస్త కూడా చోటెట్టడం లేదు - చూడు.

"అది కాదే - ఈలోగా నువ్వు ముఖం కడుక్కుంటే కాఫీ ఇద్దాం అని"

సుబ్బాయమ్మ మొహం చూసే సరికి సిమ్మాచలానికి నమ్మకం కుదిరింది. ఇవేవీ తనని ఉబ్బించడానికి అంటున్న మాటలు కాదనీ, నిజంగానే ముగ్గుపెట్టడానికి సుబ్బాయమ్మ ముచ్చట పడుతోందనీ నమ్మకం కలిగింది. అందుకే పట్టుదల తగ్గించి, "అయితే సరే కుసింత పొడరు సేతిలో ఎయ్యండి మరి" అంది సిమ్మాచలం.

హమ్మయ్య దీన్ని పల్టీ కొట్టించాం. లేకపోతే దీని తెలివితేటలు తన ముందా? గర్వంగా సకిలించినట్లు గొంతు ఒకమారు సరిచేసుకుంది సుబ్బాయమ్మ.

"కాఫీ నేనుతాగేస్తున్నాను మిగిలింది గిన్నెలో మూతెడుతున్నా మరి" కోపం బాగా వచ్చినట్లుంది రామారావుకి, అందుకే గొంతులో ఆ సౌమ్యం.

గిన్నెలో ఉంటే చల్లారిపోదూ? అసలే సిమ్మాచలానికి కాఫీ బాగా వేడిగా ఉండాలి. కంగారుగా అరిచింది సుబ్బాయమ్మ. "గిన్నెలో వద్దు. మిగిలిన కాఫీ ఫ్లాస్కులో పోసి

మూతెట్టండి'' అంటూ. టూత్ పౌడరు కోసం జాపిన సిమ్మాచలం చెయ్యి ఆ మట్టునే ఉంది. ఆ సంగతి జ్ఞాపకం వచ్చి ముగ్గుపెట్టడం మధ్యలో ఆపి గబగబా వచ్చింది సుబ్బాయమ్మ.

"పౌడరు ఎందుకులే - పేస్ట్ వేలికి రాస్తాను. పళ్ళుతోముకో'' అంది.

సుబ్బాయమ్మ పెడుతూన్న ముగ్గులు చూస్తూ, అటూ ఇటూ పచార్లు చేస్తూ "అమ్మగారూ మా బాగా ఎడతారండి ముగ్గులు'' అంటూ మధ్య మధ్య మెచ్చుకుంటూ. పళ్ళు తోముకుంటోంది సిమ్మాచలం.

కోపం, రుస రుసలూ పోయి సిమ్మాచలం కబుర్లు చెబుతూ సరదాగా ఉండడంతో, కొండంత బరువేదో గుండెలమీంచి దిగినట్లు, హమ్మయ్య - అంటూ బెంగతగ్గి హాయిగా ఉంది సుబ్బాయమ్మ.

తర్వాత సిమ్మాచలం, సుబ్బాయమ్మా కబుర్లు చెప్పుకుంటూ ముఖాలు కడుక్కున్నారు.

నవ్వుకుంటూ కాఫీలు తాగారు.

సిమ్మాచలం చిన్న పీట చెక్క వేసుకుని అంట్ల గిన్నెల దగ్గర కూచుంటే, సుబ్బాయమ్మ ఇటూ అటూ తిరుగుతూ సిమ్మాచలానికి కావలసినవి అందిస్తోంది.

ఇత్తడి గిన్నెలకి చింతపండు పట్టికెళ్ళి ఇచ్చింది. జిడ్డు పోవడానికి మెత్తటి రంపంపొట్టు అందించింది. స్టీల్ సామాన్లకని గీతలు పడని తెల్లపొడుం ఇచ్చింది. ఇద్దరూ, ఎంతో సయోధ్యగా కష్టం సుఖం చెప్పుకుంటూ చెరోపనీ చేసుకుంటున్నారు.

"అమ్మగారూ కాఫీ గుడ్డ జాడించేను. ఆరేసుకోండి''

"అలాగే కడిగేసిన గిన్నెలిలా ఇయ్యి, మంచి నీళ్ళెట్టి తొల్చుకుంటా''

"ఈ గిన్నె మాడిపోయింది. నీళ్ళేసి నానబెట్టున్నా. సాయంత్రం వొచ్చి తోముతా''

"సర్లే. నాకిప్పుడాగిన్నె అవసరం లేదు''.

"ఆ బాల్చీ ఇలా ఇవ్వండమ్మగారూ''

"ఉండు. ఇది కాళీది, నీళ్ళు కొట్టిస్తా''

ఇలా ముచ్చట్లాడుకుంటూ మురిపాలుపోతూ, ఇంటికైన ఇల్లాలూ, జీతానికి కుదిరిన పనిమనిషీ గంటల్ని నిముషాలుగా గడిపేస్తూంటే హాల్లోనే అటూ ఇటూ పచార్లు చెయ్యసాగాడు రామారావు.

"గెడ్డం గీసుకోవాలి. వేణ్ణీళ్ళు పట్రా'' - పెరట్లోకి వినిపించేలాగ కిటికీలోంచి అరిచాడు.

"చెయ్యూరుకేలేదు. ఇవాళ్టికి చన్నీళ్ళతో కానియ్యండ"ని సుబ్బాయమ్మ జవాబు.

"చెయ్యూరుకే లేకపోడానికి ఏం చేస్తోందక్కడ?" అని ఏక విసుక్కోవడమేకాని, భార్య ఎంత హడావిడిలో ఉందో రామారావు గ్రహిస్తేగా?

సిమ్మాచలం కడిగి ఇచ్చిన గిన్నెలు తొల్చుకోవడం, ఉతికి ఇచ్చిన బట్టలు ఆరేసుకోవడం. ఉడకేసుకోడానికి లేవంటే సోలెడు బియ్యం కొలిచి కొంగులో పొయ్యడం, తలరుద్దుకోడానికి కావాలంటే కుంకుడుకాయలు పొట్లంకట్టి ఇవ్వడం, ఈ పనుల్లో క్షణం తీరిక లేకుండా తిరుగుతోంది సుబ్బాయమ్మ.

గెడ్డం గీసుకోవడం పూర్తి చేసి లేస్తూన్న రామారావుకి, గదిలోకి తటిల్లతలా ఇట్టే వచ్చి అట్టే పోతూన్న ఇల్లాలు కనిపించింది. "ఆ సెంటెడ్ హేర్ ఆయిల్ ఎక్కడికి?" ఆశ్చర్యంగా అడిగాడు రామారావు.

"ఆ ... కొంచెం కొబ్బరి నూనె చుక్కఉంటే చేతిలో వెయ్యమంది సిమ్మాచలం. మనం వాడేది ఈ నూనే కదా?"

సీసాతో వెళ్ళిపోయిన భార్య దిక్కే చూస్తూ ఉండిపోయాడు రామారావు. తెరచిన నోరు మూయడమే మరచిపోయాడు.

సిమ్మాచలం, గేటు తెరిచి వెళ్ళిపోయిన చప్పుడువిని 'హమ్మయ్య' అని స్థిమితంగా శ్వాస వదలి భార్య దగ్గరికి వచ్చాడు.

సుబ్బాయమ్మ, ఇసుకా, పీచూ వేసి జబ్బలు పడిపోయేలాగ ఓగిన్నెతో ము కుంటోంది. ఆమె అవస్థ చూసే సరికి రామారావుకి కళ్ళనీళ్ళు తిరిగాయి. కోపం కూడా వచ్చింది.

"నువ్వు తోము కుంటున్నావేం?" అన్నాడు.

"అడుగు బాగా మాడిందిలెండి"

"మధ్యాహ్నం వచ్చి అదే తోముతుందిగా"

"కాదు - నాకిప్పుడే గిన్నె అవసరం. మీకు ఆఫీసు టైముకి అన్నం వండి పెట్టొద్దూ?"

"ఇంకేం వండుతావు? తొమ్మిదైంది. బజార్లో ఏ టిఫెనో తినేసి వెళ్ళిపోతాలే?"

సుబ్బాయమ్మ కన్నీళ్ళతో భర్త కేసి చూసింది.

"ఛ... ఏమిటది? ఒక్కొక్కప్పుడు వండలేక పోతావు. ఆ మాత్రానికే?"

"మీకు స్నానానికి వేణ్ణీళ్ళు కూడా కాచలేదు"

"ఫర్వాలేదు"

"అన్నట్టు ఆ పేంటూ షర్టూ ఇస్త్రీ చెయ్యమన్నారు కదూ?"

"సాయంత్రంచెయ్యి. ఈ పూటకి పాతవే వేసుకెళ్తానులే"

"నిజంగా ఈయన దేవుడు" అని మనస్సులో నమస్కరించుకొంది సుబ్బాయమ్మ.

బట్టలేసుకుని రామారావు బయల్దేరబోతూండగా సిమ్మాచలం మళ్ళీ గేటు తీసుకుని వచ్చింది. వచ్చి నేరుగా పెరట్లోకి వెళ్ళింది. "లేదంటే కాదు. చూడండి చాలా అవసరం. మళ్ళీ నేనీ రెండు రూపాయలకోసం, మాసెల్లెలిగారి ఊరు నడిసి ఎల్లిరావాలి. ఇయాలా రేపూ పని మానేసి ఊరెల్లాననుకోండి..."

సిమ్మాచలాన్ని ఆ తర్వాత మాటలు మాట్లాడనియ్యలేదు సుబ్బాయమ్మ. "మీకు పుణ్యం ఉంటుంది. ...ఇవ్వండి... మళ్ళీ అది పని మానేసిందంటే... " అంటూ రామారావు జేబులో నెలాఖరుకి అని దాచుకున్న. ముఖ్యంగా ఆ పూట టిఫిన్‌కని జేబులో వేసుకున్న ఆరెండు రూపాయలూ పట్టుకుపోయింది. నీరసంగా "నేవెళ్తున్నా, గేటు వేసుకో" అన్న రామారావు కేకకి, "ఆ ... వెళ్ళండి నేను వేస్తాలెండి గేటు" అన్న సుబ్బాయమ్మ జవాబు పెరట్లోంచి వినిపించింది.

"నిజానికి ఆయన దేవుడు. ఎన్ని లోటుపాట్లనయినా నవ్వుతూ క్షమిస్తారు. పతిదేవుళ్ళు పగలంతా ఎక్కడ ఊరేగినా సాయంత్రానికి దేవాలయానికి చేరుకుంటారు. కాని పనిమనుష్యులు అలాకాదే - వాళ్ళకి కోపం వస్తే - హమ్మో! ఇంకేమైనా ఉందా?" గుండెలమీద చేతులేసుకుని ఉలిక్కి పడింది సుబ్బాయమ్మ.

*(1977 విజయ)*